క్లుప్తంగా

మద్యం తాగి వాహనం నడపొద్దు



డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

సుల్తానాబాద్‌రూరల్/సుల్తానాబాద్: మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్సై రవికాంత్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద గురువారం ప్రత్యేక వాహన తనిఖీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలను ఆపి వాహన పత్రాలు, డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానాతో జైలుకెళ్లడం తప్పదన్నారు. తనిఖీల్లో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

షీటీంపై అవగాహన



అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గర్రెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం షీటీంపై ఇన్‌చార్జి ఏఎస్సై మల్లన్న ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి, మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా వేధింపులకు గురైతే వెంటనే డయల్ 100కు, 63039 23700 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. అంతకుముందు విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రెండో ఎస్సై వేణుగోపాల్, హెచ్‌ఎం కవిత, షీటీం సిబ్బంది స్నేహలత, తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు జన్మ పవిత్రమైంది



కేక్ కట్ చేస్తున్న క్రైస్తవులు

మంథని: ఏసుక్రీస్తు జన్మ పవిత్రమైందని ఐఎంఐ ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్ అన్నారు. పట్టణంలోని సీయోను ప్రార్థన మందిరంలో మంథని ఫీల్డ్ పాస్టర్ల సహవాస కూడిక గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఐఎంఐ ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్, ఎఫ్ఈసీ కోశాధికారి వల్లూరి ప్రభాకర్, ఫీల్డ్ పెద్దలు మార్కు, ఆదాము, పాస్టర్లు మహేశ్, శామ్యూల్, రాజేశ్, కోటేశ్, చందు పాల్గొన్నారు.

సర్వశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

పెద్దపల్లి రూరల్: సర్వ శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మేరుగు సతీశ్ అన్నారు. పెద్దపల్లిలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న నిరసన దీక్ష శిబిరాన్ని గురువారం సందర్శించి మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం కల్పించకపోవడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని అన్నారు. సర్వశిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లకు ప్రభుత్వం ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూ జిల్లా శాఖ పక్షాన ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెకు పూర్తి సంఘీభావం ప్రకటిస్తూ ఉద్యమ కార్యాచరణలో భాగస్వాములు అవుతామని తెలిపారు.

పోలింగ్ స్టేషన్లపై అభిప్రాయం చెప్పండి

సుల్తానాబాద్: గ్రామపంచాయతీల్లోని పోలింగ్ స్టేషన్లలో ఉన్న ఇబ్బందులపై అభిప్రాయాలు తెలపాలని ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పలు పార్టీల మండల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులకు అభ్యంతరాలు ఉంటే స్వీకరించి కలెక్టర్ ద్వారా ఎన్నికల సంఘం తెలియజేస్తామని వివరించారు. ఓటర్ల జాబితాతో పాటు పోలింగ్ స్టేషన్లో, అవసరమున్న ప్రాంతాలను గుర్తించి పోలింగ్‌కు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. మాజీ ఎంపీపీ బాలాజీరావు, సీపీఐ, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సునీల్, చిలుక సతీశ్ పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

పాలకుర్తి: రైతులకు కావాల్సిన పురుగుమందులు, ఎరువులు, విత్తనాలను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు విక్రయించాలని, ఎక్కువ ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని పుట్నూర్, కుక్కలగూడుర్ గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపులను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపుల్లో ఉన్న స్టాక్, రికార్డుల్లో నమోదు చేసిన స్టాక్ వివరాలను పరిశీలించారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని సూచించారు.

ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్



మాట్లాడుతున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: సింగరేణి ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ అన్నారు. ఏరియా అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 23న జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. యంత్రాల నమూనాలను ప్రదర్శించాలని, అటవీ, పర్యావరణ, వైద్యసేవలు, సింగరేణి సేవాసమితి స్టాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈనెల 19న ఉత్తమ గృహశోభ పోటీలు, అదే రోజు వెల్ బేబీషో, ఈనెల 20న దీపాలంకరణ పోటీలు, ఈనెల 21న మహిళలకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం గోపాల్‌సింగ్, ఐఈడీ ఏజీఎం ఆంజనేయులు, ఏసీఎంవో కిరణ్‌రాజ్‌కుమార్, ఎన్విరాన్‌మెంట్ డీజీఎం ఆంజనేయప్రసాద్, ప్రాజెక్ట్ అధికారి చంద్రశేఖర్, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు పాల్గొన్నారు.

ఆర్జీ–2 ఏరియాలో..

సింగరేణి డే సందర్భంగా మహిళలకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్జీ–2 అధికార ప్రతినిధి అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న సీఈఆర్‌క్లబ్‌లో ఆటల పోటీలు, జీఎం ఆఫీస్‌లో మహిళలకు ఆటలపోటీలు, 16న ఎస్‌సీవోఏ క్లబ్‌లో అధికారుల భార్యలకు, పిల్లలకు ఆటలపోటీలు, 20న యైటింక్లయిన్‌కాలనీ అబ్దుల్‌కలాం స్టేడియంలో దీపాలంకరణ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గెలుపొందిన వారికి ఆర్జీ–2 జీఎం వెంకటయ్య చేతుల మీదుగా సింగరేణి వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

సీఎం కప్ పోటీ విజేతలకు బహుమతి ప్రదానం



జ్యోతినగర్: విజేతలకు ప్రశంసపత్రాలు అందిస్తున్న ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్



రామగుండం: విజేతలకు బహుమతులు అందిస్తున్న తహసీల్దార్ రవీందర్



ధర్మారం: విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న చైర్మన్ రూప్లానాయక్

జ్యోతినగర్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గురువారం ఎన్టీపీసీ రామగుండం టీటీఎస్ జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో సీఎం కప్ క్రీడా పోటీలను జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం గొర్రె జయరాజు ప్రారంభించారు. ఓపెన్ కేటగిరీలో కబడ్డీ, ఖోఖో, అండర్–18 విభాగంలో వాలీబాల్ క్రీడలు నిర్వహించారు. విజేతలకు జెడ్పీహెచ్ఎస్ ఎన్టీపీసీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జయరాజు బహుమతులు ప్రదానం చేశారు.

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలో క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన జట్లు ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారు. విజేతలకు అంతర్గాం తహసీల్దార్ తూమ్ రవీందర్, ఎంపీడీవో ఎం ఏ అలీం ప్రశంస పత్రాలు అందజేశారు. ఫిజికల్ డైరెక్టర్ మండల కన్వీనర్ తుల శోభారాణి, అంతర్గాం ఎస్సై వెంకటస్వామి పాల్గొన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో పోటీలను ఎంఈవో సరస్వతి ప్రారంభించారు. ఎంపీవో అనిల్‌రెడ్డి, వైద్యాధికారి సంపత్‌రెడ్డి, హెచ్‌ఎం లచ్చయ్య పాల్గొన్నారు.

ముత్తారం: ముత్తారం జెడ్పీ పాఠశాలలో గురువారం జరిగిన సీఎం కప్ మండల స్థాయి క్రీడాపోటీల్లో గెలుపొందిన జట్లకు ఎంపీడీవో సురేశ్ షీల్డ్ అందజేశారు. మండలస్థాయి ఖోఖో పోటీల్లో గెలుపొందని జట్లు జిల్లాస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ఎంపీడీవో తెలిపారు. ఎంఈవో ఇరుగురాల ఓదెలు, ముత్తారం జెడ్పీ పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సూర్యప్రకాశ్, పీఈటీలు వెంకటేశ్, స్వప్న ఉన్నారు.

ధర్మారం: మండలంలోని నందిమేడారం గురుకులం విద్యాలయంలో జరిగిన సీఎం కప్ మండల స్థాయి ముగింపులో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రూప్లానాయక్ పాల్గొని విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. వైస్ చైర్మన్ అరిగె లింగయ్య, మండల ప్రత్యేకాధికారి వీరబుచ్చయ్య, ఎంపీడీవో ప్రేమ్‌కుమార్, తహసీల్దార్ ఎండీ ఆరిఫోద్దిన్, మండల విద్యాధికారి చాయాదేవి, ఎంపీవో రమేశ్, విద్యాలయం ప్రిన్సిపాల్ విద్యాసాగర్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్, సౌజన్య, గట్టయ్య, శ్రీధర్, నర్మద, భాగ్యలక్ష్మి, స్రవంతి, స్వరూప పాల్గొన్నారు.

పోలీసులు బెదిరింపులకు గురిచేయడం సరికాదు

గోదావరిఖని: శాంతియుత ర్యాలీకి వచ్చిన ప్రజలను పోలీసులు బెదిరింపులకు గురిచేయడం సరికాదని బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తాము శాంతియుత బైక్ ర్యాలీ నిర్వహిస్తే పోలీసులు వచ్చి అడ్డుకుని బెదిరింపులకు దిగారని ఆరోపించారు. కాంగ్రెస్‌కు, ఎమ్మెల్యేకు ఏజెంట్‌గా పోలీసులు వ్యవహరిస్తున్నారన్నారు. ఇక్కడి పోలీసుల తీరుపై కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు చేస్తామన్నారు. రామగుండం ఎమ్మెల్యే అభివృద్ధి పేరిట కూల్చివేతలకు పాల్పడుతున్నారని విమర్శించారు. గెలిచిన వెంటనే ఆర్ఎఫ్‌సీఎల్‌లో నష్టపోయిన బాధితులకు డబ్బులు ఇప్పిస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు నెరవేర్చలేదన్నారు. బండలవాగు ప్రాజెక్టు నెల రోజుల్లోగా చేస్తామని చెప్పి నెరవేర్చలేదన్నారు. సమావేశంలో నాయకులు మేర్గు హన్మంతుగౌడ్, క్రిష్ణ, స్వామి, రమేశ్, సతీశ్, నరహరి పాల్గొన్నారు.



పత్రాలు విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

కానిస్టేబుల్‌కు రివార్డు



రివార్డు అందజేస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

గోదావరిఖని: మిస్సింగ్ కేసులో కీలకంగా వ్యవహరించి కేసును ఛేదించిన గోదావరిఖని వన్‌టౌన్ కానిస్టేబుల్‌ను సీఐ ఇంద్రసేనారెడ్డి అభినందించారు. ఐదునెలల నుంచి కనిపించకుండా పోయిన గోదావరిఖనికి చెందిన వ్యక్తిని గుర్తించి తీసుకొచ్చిన కానిస్టేబుల్ ఐతోజు రమేశ్‌కు సీఐ రూ.2వేల రివార్డు అందజేశారు. రెండో సీఐ కె.రవీందర్, ఎస్సైలు శ్రీనివాస్, భూమేశ్, ఓబులమ్మ పాల్గొన్నారు.

రామగుండం అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి

జ్యోతినగర్: ఎన్టీపీసీ సంస్థ రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి రూ.1,000 కోట్లు కేటాయించాలని ఎన్టీపీసీ పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎండీ ఆసిఫ్ పాషా డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ సంస్థ నూతనంగా నిర్మించనున్న విద్యుత్ ప్రాజెక్టుల విషయంలో సంస్థ మొండి వైఖరికి నిరసనగా గురువారం పార్టీ నాయకులతో కలిసి ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లో సమావేశంలో ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ కొత్త ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభం ముందే చట్టబద్ధంగా రావాల్సిన సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.600 కోట్లు, రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి రూ.1000 కోట్లు చెల్లించాలన్నారు. ప్రభావిత గ్రామాల్లో, డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని కోరారు. నాయకులు మల్లేశ్, రాజ్‌కుమార్‌యాదవ్, హరిప్రసాద్, రాజిరెడ్డి, రవి, వెంకటరెడ్డి, పద్మ, యువజన కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ రమేశ్, నరసింహారెడ్డి, సతీశ్, భరత్, మల్లేశ్, అవినాష్, అబ్బాస్, సదానందం, లింగమూర్తి, వాసు, తిరుపతి, మొగిలి, యాదగిరి, సరిత, సాయి ప్రసన్న పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



పనులు పరిశీలిస్తున్న అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామమైన రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్ కాలనీ 18వ డివిజన్ అల్లూరు గ్రామ శివారులోని చెరువుకట్టపై మొరం గ్రానైట్ రోడ్డు పనులు గురువారం ఆర్జీ–2 సింగరేణి సివిల్ అధికారులు, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఆదేశాల మేరకు కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. రూ.5లక్షల నిధులతో అల్లూరులో శ్మశాన వాటిక, దోబి ఘాట్, చెరువు కట్ట మరమ్మతు, తదితర అభివృద్ధి పనులను సింగరేణి సివిల్ అధికారులు పరిశీలించారు. నాయకులు మార్క రాజు, రాకేశ్ అజయ్, సింగరేణి సివిల్ డిపార్ట్‌మెంట్ అధికారులు నరేశ్, సురేశ్ పాల్గొన్నారు.

బొడ్రాయి ఉత్సవాలు ప్రారంభం

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ అల్లూరు గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీభూలక్ష్మి, శ్రీలక్ష్మి సహిత గ్రామశిల (బొడ్రాయి) విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు విగ్రహాలను ఊరేగించారు.

సంక్షిప్త వార్తలు

• స్థానిక ఎన్నికల్లో సహకరించాలి

కమాన్‌పూర్: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని పార్టీల వారు సహకరించాలని ఎంపీడీవో లలిత అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఆయా పార్టీలకు చెందిన నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మండలంలోని తొమ్మిది గ్రామపంచాయతీల్లో 92 వార్డులుగా విభజించినట్లు ఈ నెల 17న గ్రామ పంచాయతీల వద్ద వార్డుల జాబితా ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా పార్టీల నాయకులు తాటికొండ శంకర్, రాజు, అజయ్, రాము, బొంద్యాలు పాల్గొన్నారు.

• పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కోసం భవనం పరిశీలన

ఎలిగేడు: పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కృషితో మండలానికి పోలీస్‌స్టేషన్ మంజూరు చేస్తూ జీవో నెంబర్ 88ద్వారా స్పెషల్ సెక్రటరీ రవిగుప్తా ఈనెల 2న ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఎలిగేడు మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ కోసం నిర్మించిన, పాత తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని గురువారం సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, జూలపల్లి ఇన్‌చార్జి ఎస్సై నరేశ్‌కుమార్ పరిశీలించారు. స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు దుగ్యాల సంతోష్‌రావు, బూర్ల వెంకటసత్యం, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు ఉన్నారు.

• క్షయను నిర్మూలిద్దాం

కమాన్‌పూర్: క్షయవ్యాధి నిర్మూలనపై మండల కేంద్రంలో గురువారం ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు.

• కోతుల దాడి: ఇద్దరికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ మండలం మీర్జంపేటలో కోతులు దాడి చేసి ఇద్దరిని గాయపర్చాయి. గురువారం రామిడి మాధవరెడ్డిని కరిచి గాయపర్చగా, మూడు రోజుల క్రితం కల్వల సరోజనపై దాడి చేసి గాయపర్చినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో కోతుల బెడదతో గ్రామస్తులు భయాందోళనకు గురువుతున్నామని వాపోయారు. అధికారులు చర్యలు తీసుకుని కోతులను బంధించాలని కోరుతున్నారు.

• మెనూ ప్రకారం భోజనం అందించాలి

సుల్తానాబాద్‌రూరల్: విద్యార్థులకు వేడి భోజనం వడ్డించాలని తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలం భూపతిపూర్‌లోని మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయాన్ని గురువారం తహసీల్దార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గదిని పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందుతుందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఆదేశించారు. ప్రిన్సిపాల్ రాజేశం, సిబ్బంది ఉన్నారు.

• శ్రీదత్త జయంతి కరపత్రాల ఆవిష్కరణ

రామగుండం: స్థానిక రైల్వేస్టేషన్ ఎదుట కొండపై నెలకొన్న సాయిబాబా ఆలయంలో 15న నిర్వహించే శ్రీదత్తసాయి జయంతి కరపత్రాన్ని ఆవిష్కరించినట్లు గురువారం ఆలయ కమిటీ చైర్మన్ కన్నూరి సతీశ్‌కుమార్ తెలిపారు. ఆలయ పూజారి రాంపెల్లి శ్రీనివాస్‌శర్మ, తిరుపతి, శ్రీకాంత్, శ్రీనివాస్, అర్జున్, శ్రీనివాస్, రజినీ, శోభ, స్వప్న ఉన్నారు.

• ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠాపన

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంటలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. స్థానిక శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని ధ్వజస్తంభం శిథిలావస్థకు చేరగా మండలంలోని ధూళికట్టకు చెందిన దాత బుద్దినేని వామన్‌రావు సొంత ఖర్చులతో ఆలయ ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ చేశారు. దాత వామన్‌రావు, మాజీ సర్పంచ్ సంతోష్‌రావు, నల్ల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నల్ల మనోహర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కామరాజు, రాజేశ్వర్‌రెడ్డి, శంకరయ్య, పూజారులు భరత్ కుమారచార్య, శ్రీధర్, నేరెళ్ల చార్య, రానుజం, సత్యనారాయణ పాల్గొన్నారు.

• రోడ్డు నిర్మాణ భూముల్లో సాగు చేయొద్దు

ముత్తారం: మండలంలో నేషనల్ హైవే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం అవుతున్నాయని మండల వ్యవసాయాధికారి అనూష గురువారం తెలిపారు. నేషనల్ హైవే రోడ్డు నిర్మాణంలో పోతున్న భూముల్లో సాగు చేయొద్దని సూచించారు.

కాంట్రాక్టు ఉద్యోగికి ఆర్థికసాయం అందజేత



సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

గోదావరిఖని: జీడీకే–5 ఓసీపీలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్న విలాసాగరం సంజీవ్ బ్లడ్ క్యాన్సర్‌తో హైదరాబాద్‌లో బసవతారకం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సదాశయ ఫౌండేషన్ సభ్యుడు గుర్రం ఎర్రయ్య ఆధ్వర్యంలో బీఈఎంఎల్, ఓసీపీ–5 ఉద్యోగులు, రామగుండం ఎస్బీఐ బ్రాంచి ఉద్యోగి గర్వంద మహిపాల్ స్పందించి రూ.1.14లక్షలు అందించారు. బీఈఎంఎల్ మేనేజర్ జీఎస్‌శర్మ చేతుల మీదుగా బాధితుని బంధువులు రాములు, సుధాకర్‌కు అందించారు. బాధితుని సాయం కోసం చొరవ చూపిన ఫౌండేషన్ సభ్యుడిని జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, ప్రచార కార్యదర్శి కేఎస్ వాసు అభినందించారు.

సింగరేణి వార్తలు

నాణ్యతా ప్రమాణాలు పాటించండి



మాట్లాడుతున్న జీఎం ఎన్.సుధాకర్‌రావు

రామగిరి: సమష్టి కృషితో భద్రతతో విధులు నిర్వహిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని జీఎం ఎన్.సుధాకర్‌రావు ఆదేశించారు. ఆర్జీ–3 డివిజన్‌లోని ఓసీపీ–2 గనిలో గురువారం నిర్వహించిన మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థ సాధిస్తున్న ప్రగతి, నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడానికి చేసినటు ప్రణాళికల గురించి అధికారులు పీపీటీ ద్వారా అవగాహన కల్పించారు. నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను అధిగమించడంతో పాటు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ అంకిత భావంతో విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించాలన్నారు. సంస్థ అభివృద్ధికి పలువురు ఉద్యోగులు అందించిన సలహాలు అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్‌సీ రెడ్డి, ఐఎన్‌టీయూసీ ప్రతినిధి రామారావు, అధికారుల సంఘం అధ్యక్షుడు, పీవో సీ.హెచ్.వెంకటరమణ, ఎస్వోటూ జీఎం జి.రఘుపతి, ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, ఐఈడీ డీజీఎం చంద్రశేఖర్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ప్రాజెక్టు ఇంజనీర్ చంద్రశేఖర్, మేనేజర్ కె.వి.రామరావు, పిట్ సెక్రటరీలు ఆర్.మనోహర్, ఎల్లయ్య పాల్గొన్నారు.

రక్షణతో కూడిన లక్ష్యాలు సాధించాలి



రక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

గోదావరిఖని: సంస్థలో పనిచేస్తున్న ప్రతీఒక్కరు రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలని ఆర్జీ–2 జీఎం బి.వెంకటయ్య అన్నారు. వకీల్‌పల్లిగనిలో మల్టీడిపార్ట్‌మెంట్ కమిటీ సభ్యులు గురువారం పర్యటించారు. సంస్థ స్థితిగతులను కార్మికులకు వివరించారు. కంపెనీ లక్ష్యాలు, భూగర్భగనుల యంత్రాల వినియోగం, ఉపరితల గనుల్లో భారీ యంత్రాల పనితీరుపై కార్మికులకు అర్థమయ్యే రీతిలో ఎల్ఈడీ ప్రొజెక్టర్ ద్వారా వెల్లడించారు. సంస్థలో అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికలు, ముందున్న సవాళ్లు, కంపెనీ లక్ష్యాలను సాధించడానికి మనమేం చేయాలి? తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఉద్యోగుల నుంచి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు తీసుకున్నారు. అత్యుత్తమ పనితీరు ప్రదర్శించిన ఉద్యోగులకు బహుమతి అందజేశారు. అనంతరం రక్షణ ప్రతిజ్ఞ చేశారు. నాయకులు జీగురు రవీందర్, ఏరియా ఇంజినీర్ నరసింహారావ్, ఎస్వోటూ జీఎం ఎం.రాముడు, పర్సనల్ డీజీఎం ఎస్.అనిల్‌కుమార్, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, వకీల్‌పల్లి ప్రాజెక్టు అధికారి నెహ్రూ, గని మేనేజర్ రవికిరణ్ పాల్గొన్నారు.

కార్మిక హక్కుల సాధన ఐఎన్‌టీయూసీతోనే సాధ్యం



మాట్లాడుతున్న కోట రవీందర్‌రెడ్డి

రామగిరి: సింగరేణి కార్మిక హక్కుల సాధన ఐఎన్‌టీయూసీతోనే సాధ్యమని ఆర్జీ–3 ఏరియా ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి అన్నారు. సెంటినరికాలనీ శ్రీపాదభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా గోదావరిఖనిలో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, రామగుండంలో 800 మెగావాట్ల పవర్ ప్లాంట్, ఒడిశాలోని నైనీ ప్రాజెక్టు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, రూ.కోటి ప్రమాద బీమా, స్థానికులకే 80శాతం ఉద్యోగాలు, సోలార్ ప్లాంట్ నిర్మాణం, బీసీ లైజనింగ్ అధికారి నియామకంతో పాటు పలు హామీలు నెరవేర్చినట్లు పేర్కొన్నారు. కార్మికులకు ఇంటి స్థలంతో పాటు ఐటీ మినహాయింపు విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, మినిమమ్ వేజ్ బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తామన్నారు. సెంట్రల్ సెక్రటరీ గడ్డం తిరుపతి, సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మడ్డి రాజ్‌కుమార్‌గౌడ్, బ్రాంచ్ సెక్రటరీ ఎస్.శ్రీనివాస్‌రావు, రెసిడెన్షియల్ కమిటీ సభ్యులు తాళ్లపెల్లి నారాయణ, పిట్ సెక్రటరీలు వెంకటస్వామి, మనోహర్, సదానందం, బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్, పాండు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పుష్పాభిషేకం



పుష్పాభిషేకం చేస్తున్న అర్చకులు అశోక్ శర్మ

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో ఏకాదశి పురస్కరించుకొని బుధవారం రాత్రి ఆలయ అర్చకులు కర్నె అశోక్ శర్మ 21 రకాల పూలతో మహా పుష్పాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన గురుస్వామి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ శబరిమలై సన్నిధానంలో నిర్వహించినట్టుగా ఆర్ఎఫ్‌సీఎల్ శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో మహా పుష్పాభిషేకం వైభవంగా నిర్వహించామని తెలిపారు. అనంతరం ఆలయంలో మెట్లపూజ నిర్వహించారు.



గోదావరిఖని: స్థానిక 33వ డివిజన్ ఫైవింక్లయిన్ మసీద్ కాంప్లెక్స్ ఎదుట పోచమ్మ గుడి పక్కన ఉన్న కల్వర్టు కుంగి హోల్స్ పడ్డాయి. సైడ్‌వాల్ కూడా కూలిపోయింది. దీంతో ఈ కల్వర్టుపై నుంచి నడిచేందుకు కూడా స్థానికులు భయపడుతున్నారు. వెంటనే మరమ్మతు చేయాలని స్థానికుడు మద్దెల దినేశ్ కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500